

# పబ్లిక్ అకౌంట్స్ కమిటీ

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ చిదంబరంగారు ఠీవిగా హాలులోకి అడుగు పెట్టారు.

అధికారపక్ష సభ్యులూ, ప్రతిపక్ష సభ్యులూ, మహా గణకులూ, వారి సిబ్బంది, చిన్న, పెద్ద ఇంజనీర్లవారికి సంబంధించిన క్లరికల్ సిబ్బందీ- అందరూ గౌరవసూచకంగా తమ స్థానాలలోంచి లేచి నిలబడ్డారు.

ఛైర్మన్‌గారు తన సీట్లో ఆసీనులు కాగానే అందరూ ఎవరి సీట్లలో వారు గాభరా గాభరాగా కూర్చున్నారు.

అది ఎయిర్ కండిషన్డ్ హాల్ అయినప్పటికీ చెమటలు పడుతున్నాయి. కొందరు ఇంజనీర్లకు ఏ ఉపద్రవం ఎదుర్కోవల్సి వస్తుందోనని.

ఇంతలో వేడి వేడి నెస్‌కేఫ్ లొచ్చాయి. అందరూ సేవించారు.

మిస్ అప్రోప్రియేషన్స్‌కు సంబంధించిన ఆడిట్ పేరాపై చర్చ మొదలైంది.

"కుక్కుటరావుపేట డివిజన్‌లో అగ్ని ప్రమాదం సంభవించి రెండు వేల రూపాయిల ప్రభుత్వ ఆస్తికి నష్టం వాటిల్లింది. ఆ ప్రమాదానికి కారకుడైన వాచ్‌మన్ పిచ్చయ్య నుండి ఆ డబ్బు వసూలు చేస్తామన్నారు ఎక్స్‌ప్లనేటరీ నోట్‌లో, చేశారా? లేదా?" అని ప్రశ్నించారు ఛైర్మన్‌గారు.

"ఆ రికవరీకి సంబంధించిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది" అన్నారు చీఫ్ ఇంజనీరుగారు.

"ఆ వాచ్‌మన్‌కొచ్చే జీతమే వేయి రూపాయిల లోపు వుంటుంది. సాధారణ రికవరీలు కొన్నుంటాయి. వాటికి తోడు యిదొకటా పాపం! ఆ అర్భకుడికి. వాడు మాత్రమేం చేస్తాడు? ఎండాకాలం కనుక ఏ నిప్పు రవ్వో ఎగిరొచ్చి ఆ హాట్‌పై పడి అది కాలిపోయుంటుంది. రైట్‌ఆఫ్ చేస్తేపోలా ఆ అమౌంట్‌ను. కోట్లు కోట్లు ప్రభుత్వ ధనం ఎన్నో విధాల దుర్వినియోగమౌతున్న ఈ రోజుల్లో రెండు వేల రూపాయల గురించి ఈ పేరాలేమిటే? కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు. ఇంత స్టాఫు, కాయితాల ఖర్చు, ప్రతి చిన్న నివేదిక కోసం విపరీత కాలయాపన.. ప్చ్.. ఏవిటో! ఈ తతంగాలు" ఆ పేరాలు డీల్‌చేసే హెడ్ గుమాస్తా సుబ్బారావు ప్రక్కనున్న మరోక్లర్కు చలపతిరావుతో అన్నాడు.

"రూపాయైనా సరే. ప్రభుత్వ లెక్కంటే లెక్కే. కాయితాలమీద అవన్నీ సక్రమంగా జరగాల్సిందే. రూపాయి కోసం పది రూపాయిల స్టేషనరీ ఖర్చయినా సరే.. ఇహ.. కోట్ల విషయమంటారూ.. మీరన్నట్లు అవి లెక్కల్లోకి రావుగదా!" నర్మగర్భంగా అన్నాడు చలపతిరావు.

ఆ తర్వాత...

"ఆడిట్ పేరా 4, బుక్‌లో 28వ పేజీ.." ఛైర్మన్‌గారి కంచు కంఠం నుండి ఆ మాటలు వెలువడగానే గబగబా పేజీలు త్రిప్పటం మొదలెట్టారు అధికార్లందరూ.

"దెయ్యాల నదివద్ద కట్టిన ఆనకట్ట కొట్టుకుపోవటానికి కారణాలు చెప్పారు. కానీ అవి అంత సమర్థనీయంగా లేవు" అన్నారు ఛైర్మన్‌గారు చీఫ్ ఇంజనీర్ గారివేపు చూస్తూ.

సదరు ఇంజనీరుగారు గొంతుకేదో అడ్డుపడ్డట్టు ఓ సవరించుకుని, "మట్టిని పరీక్ష చేసే సాంకేతిక విభాగం వారి సూచనల మేరకే అక్కడ ఆనకట్ట నిర్మాణం జరిగింది. కానీ ఆమధ్య ఉధృతంగా వచ్చిన వరదలకు అది కొట్టుకుపోయి నష్టం సంభవించింది దాని రిపేర్స్ కోసం రివైజ్డ్ ఎస్టిమేట్ తయారుచేయబడింది. ఆ పనిని మరొక కంట్రాక్టర్ కప్పగించడం జరిగింది. అందువల్ల ఆ పనికి ఉద్దేశించినదానికంటే ఎక్కువ ఖర్చు ఈ విషయంలో అయింది" అంటూ అతని స్టేట్‌మెంటొకటి పారేశారు కమిటీ ముందు.

"నాదొక చిన్న డౌటు. సాయిల్ టెస్టింగ్ స్టేజిలోనే రెండు, మూడు ట్రయల్ పిట్స్ చేసి, పరీక్ష జరపాలిగదా! ఆ ఒక్కచోటే చేసి, అక్కడే నిర్మాణం జరపబట్టే కదా! ఆ ఆనకట్టకు అంత మేజర్ రిపేర్స్ అవసరమైంది. వరదలకు తట్టుకోలేకుండా నిర్మిస్తే ప్రభుత్వ ధనం ఎంతగా దుర్వినియోగమవుతుందో మీకర్థం కాని విషయమా?" బల్ల గుద్దినట్టు పాయింట్ లేవదీశాడు ఉడుకు రక్తపు ప్రతిపక్ష సభ్యుడొకరు.

"మా పరిధులకు కట్టుబడి మేం అవసరమున్నంత వరకే సాయిల్ టెస్ట్ జరిపిస్తాం. వరదలవల్ల అది చాలా భాగం కొట్టుకుపోవటం జరిగి వుండవచ్చు" అన్నారు చీఫ్ ఇంజనీరుగారు. ఆ జవాబు ఆడిట్ వాళ్లనుగానీ, మరెవర్నీ గానీ అంతగా సంతృప్తిపరిచినట్లు లేదు.

"తక్కువ రకపు సిమెంటు వాడకం, ఇసుక పాలెక్కువవటం కూడా ఒక కారణం కదా! ప్రాజెక్టు పనుల్లో ఇవి మామూలేగా.." అరచినట్లన్నాడా ప్రతిపక్ష సభ్యుడు. అతనికి తెల్సు తన ప్రశ్నకు జవాబు సరిగా రాదనీ, 'మా టెక్నికల్ డిఫికల్టీస్ మాకున్నా'యంటూ మసిపూసి మారేడు కాయ చేస్తారనీనూ.

"పందులగుంట వాగువద్ద చెరువు తవ్వారు. దానికి వేసిన కరకట్ట కొట్టుకుపోతే చర్యలు తీసుకోవటంలో జాప్యం జరిగి వృథా వ్యయమైందని పేరా 4-6 తెలుపుతోంది. దానిపై ప్రస్తుతం మీరేం చెబుతారు?" అన్నారు ఛైర్మన్‌గారు తత్సంబంధిత ఇంజనీరుగారితో.

"ముందు అగ్రిమెంటు కుదుర్చుకున్న కంట్రాక్టరు రేట్స్‌వద్ద గొడవలు తేవడంతో పని సరిగా చేయించకపోవడంతో అట్లా జరిగింది. అందుకే ఆ పనిని మరొక ఏజెన్సీ కప్పగించడం జరిగింది. ఆ ఏజెన్సీ చేసిన అవకతవకలవల్ల అధిక వ్యయమైంది. అవకతవకలకు బాధ్యులైన అధికార్లపై చర్య తీసుకోవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి" అంటూ మొహం తుడుపు సమాధానం చెప్పారు ఇంజనీరుగారు.

ఆ పి.ఎ.సి. మీటింగ్‌లో అందరి మధ్య హోరాహోరీగా మాటల యుద్ధాలు జరిగాయి. ఎన్నోసార్లు పోస్ట్ పోనయి, ఎందర్నో పరుగులు పెట్టించిన ఆ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ మీటింగ్ అన్ని పేరాలమీద చర్చలు జరిగిం తర్వాత ముగిసింది.

ఈ పి.ఎ.సి. మీటింగ్ వ్యవహారం చూడాలని వచ్చిన సుబ్బారావు ఫ్రెండయిన మరో సెక్షన్‌కు సంబంధించిన హనుమంతరావుకు ఎన్నో సందేహాలొచ్చాయి.

"ఏవిటెరా! ఈ కాకి గోలంతా" అన్నాడు సుబ్బారావుతో.

"అయితే దీని గురించి చెప్తా విను. మొదటగా ఆడిట్‌వారు సంబంధిత ఆఫీసులను ఇన్స్‌పెక్ట్ చేసి, అబ్జక్షన్స్ రైజ్ చేస్తారు. నెలలు, సంవత్సరాల తరబడి ఆ అబ్జక్షన్స్ ఆఫీసుల్లో జీడిపాకంలా సాగి, కాలవ్యవధి అయిపోయి, ఆడిట్ పేరాగా అవతరిస్తాయి. ఇవన్నీ పుస్తక రూపంలో ముద్రితమై పి.ఎ.సి. మీటింగ్‌లో చర్చకు వస్తాయి. విషయం వేరున్నా ఏ డిపార్ట్‌మెంట్‌లో నైనా పద్ధతులొకటిగానే వుంటాయి. ఎక్కడికక్కడ వీలున్నంత వరకు సర్దుబాట్లు జరుగుతుంటాయి.

గండిపడ్డ చెరువుల గురించీ, ఉద్దేశించిన పని ఎస్టిమేటూ, డిజైనింగ్‌ల ఆలస్యంవల్ల సకాలంలో పూర్తి కాకపోవడం, దానిపై వృథా వ్యయం, సాయిల్ టెస్టింగ్ లోపాలవల్ల కూలిపోయిన కట్టడాలపై, టెండర్ల పిలుపులోని అక్రమాల గురించీ- యిలా ఎన్నింటిపైనో కమిటీ వారు సిఫార్సులు చేస్తారు. కొంత కాలంపాటు తమ పలుకుబడి నుపయోగించి కష్టాల నుండి బయటపడటమో, రిటైర్ అవటమో, కాలం చేయటమో సంభవిస్తుంది.

ఇంజనీర్లకూ, కంట్రాక్టర్లకూ లాలూచీలు మామూలే కదా! వారికి అమాత్యుల అండదండలూ వుంటాయి. నిస్వార్థంగా వీరంతా శ్రమిస్తే ఏ ప్రాజెక్టూ అల్పాయుష్కరాలు కాదూ, వాళ్ళంతా కోట్లాను కోట్ల ఆస్తులూ సంపాదించలేరు.

అయితే ఏ నష్టం జరిగినా, సకాలంలో పంటకు నీరందక నష్టపోయేది రైతు సోదరుడే. ఆ నష్టం ఆర్థిక వ్యయంపై దెబ్బతీస్తుంది ఉత్పత్తి తగ్గటం ద్వారా.

బహుళార్థసాధక ప్రాజెక్టు పనుల్లో అవినీతి, అక్రమాలు యధేచ్ఛగా సాగిపోతుంటే ఇటువంటి కంటి తుడుపు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ లేంచేసాయి?

ఈ (అ)ప్రజాస్వామిక వ్యవస్థలో దోషులు శిక్షింపబడటం జరుగుతుందా! అనేది చిదంబర రహస్యమే.

— శ్రీగిరిరాజు విజయలక్ష్మి

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్